# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 15 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బీహార్ అభివృద్ధికి మరింత వేగంగా పనిచేస్తాం

- ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

"2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏకు చారిత్రాత్మక, అపూర్వమైన విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు," అని ప్రధాని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ అఖండ ప్రజాభిప్రాయం, బీహార్ కోసం మరింత సంకల్పంతో పనిచేయడానికి ఎన్‌డీఏను ఉత్సాహపరుస్తుందని అన్నారు. ఎన్‌డీఏ అభివృద్ధి దిశలో చేసిన కృషిని ప్రజలు గుర్తించారు "రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఎన్‌డీఏ నిరంతరం కృషి చేసింది. మా ట్రాక్ రికార్డు, భవిష్యత్తు దృష్టిని చూసి ప్రజలు మాకు భారీ మెజారిటీ ఇచ్చారు," అని మోదీ పేర్కొన్నారు. ఎన్‌డీఏలో ప్రతి కార్యకర్త చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. "కూటమి అభివృద్ధి ప్రభుత్వ పతాకాన్ని ఇంటింటికీ చేర్చేందుకు వారు అవిశ్రాంతంగా శ్రమించారు. వారికి నా హృదయపూర్వక అభినందనలు," అని మోదీ తెలిపారు."బీహార్ అభివృద్ధికి మరింత వేగంగా పనిచేస్తాం" అన్నారు. "రాబోయే రోజుల్లో బీహార్ అభివృద్ధికి మరింత చురుకుగా కృషి చేస్తాం. మౌలిక సదుపాయాలు, రాష్ట్ర సంస్కృతికి కొత్త గుర్తింపును అందిస్తాం. బీహార్ యువత, మహిళలు సమృద్ధమైన జీవితానికి అర్హత కలిగే అవకాశాలు విస్తరించేలా చర్యలు తీసుకుంటాం," అని మోదీ హామీ ఇచ్చారు.

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే...



- ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం
- ప్రతిరౌండ్‌లోనూ అధిక్యం ప్రదర్శించిన కాంగ్రెస్
- కేవలం రెండో రౌండ్‌లో బీఆర్ఎస్ ఆధిక్యం
- డిపాజిట్ కోల్పోయిన బీజేపీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి ఘన విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యాన్ని ప్రదర్శించడం విశేషం. కాగా, ఈ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి నవీన్ యాదవ్ ఆధిక్యంలో కొనసాగారు. మొత్తం 10 రౌండ్ల లెక్కింపు ముగిసేసరికి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 ఓట్లు మాత్రమే లభించాయి.

ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నారు. మొదటి రౌండ్‌లో కాంగ్రెస్‌కు 8,911 ఓట్లు, బీఆర్ఎస్‌కు 8,864 ఓట్లు లభించగా.. దీంతో కేవలం 47 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో కాంగ్రెస్ తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఇక రెండో రౌండ్‌లో కాంగ్రెస్ 9,691 ఓట్లు సాధించగా, బీఆర్ఎస్ 8,609 ఓట్లు పొందింది. అయిదో రౌండ్ ముగిసేసరికి కాంగ్రెస్ ఆధిక్యం 12,859 ఓట్లకు చేరింది. ఆరో రౌండ్ నుంచి తొమ్మిదో రౌండ్ ముగిసే సమయానికి కాంగ్రెస్ ఆధిక్యం 23,921 ఓట్లకు పెరిగింది. నిజానికి మధ్యలో కొన్ని రౌండ్లలో బీఆర్ఎస్ పుంజుకున్నప్పటికీ కాంగ్రెస్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ విజయం దిశగా సాగింది. ఇదిలావుంటే ఉదయం కౌంటింగ్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ప్రారంభం కాగా, అందులోనూ కాంగ్రెస్‌కే ఎక్కువ ఓట్లు లభించాయి. మొత్తం 101 పోస్టల్ ఓట్లు పోలవ్వగా, 96 చెల్లిన ఓట్లలో కాంగ్రెస్‌కు 43, బీఆర్ఎస్‌కు 25, బీజేపీకి 20 ఓట్లు వచ్చాయి.

జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ గట్టి ప్రయత్నమే చేసినప్పటికీ, ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. ప్రతి రౌండ్ ముగిసేసరికి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత వెనుకంజలోనే ఉన్నారు. ఇక ఈ ఎన్నికలో ప్రభావం చూపుతామని భావించిన బీజేపీకి తీవ్ర నిరాశ ఎదురైంది. ఆ పార్టీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ప్రారంభం నుంచి పోటీ అంతా ప్రధాన పార్టీలే మధ్య నెలకొనగా..కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలతో పాటు పలు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో ఉండటం గమనార్హం. అయితే, ఏ అభ్యర్థికీ ఓటు వేయని వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. నోటాకు 1,863 ఓట్లు రావడం, ప్రధాన పార్టీల తర్వాత నాలుగో స్థానంలో నిలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇతర అభ్యర్థులకు

వెయ్యి కంటే తక్కువ ఓట్లు పొందినట్టు ఎన్నికల కమిషన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం తెలుస్తోంది. మొత్తానికి ఈ ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చినట్టయింది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడం బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## రెండేండ్ల పాలనపై ప్రజా తీర్పు ఇది



- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరు మార్చుకోవాలి
- హరీశ్‌రావు అసూయ, కేటీఆర్ అహంకారం తగ్గించుకోవాలి
- కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో లేరు
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరగనున్న కేబినెట్ సమావేశంలో నిర్ణయం
- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో పార్టీపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సీఎం మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల అనంతరం హైదరాబాద్ పట్టణ ప్రజలు కాంగ్రెస్‌పై క్రమంగా నమ్మకం పెంచుకుంటున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు, గెలిపించిన ప్రజలకు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు పెద్దగా ఫలితాలు రాకపోయినా, రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి ఈ ఉపఎన్నికలో స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తర్వాత తమ బాధ్యత మరింత పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేయాలని సంకల్పించామనీ, దానిలో భాగంగా మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, మూసీ పునరుజ్జీవం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, గోదావరి జలాల తరలింపు లాంటి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమపార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపుతో తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఎన్నికల్లో నెగ్గితే ఉప్పొంగడం, ఓడితే కుంగిపోవడం కాంగ్రెస్‌కు తెలియదనీ, ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడటం, అధికారంలో ఉంటే సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసనీ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారనీ, పోలైన ఓట్లలో 51 శాతం కాంగ్రెస్‌కు, 38 శాతం బీఆర్ఎస్‌కు, 8 శాతం బీజేపీకి ఓటు వేశారని విశ్లేషించారు. తమ ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా గమనించి ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని సంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలతో ప్రభుత్వంపై బీఆర్ఎస్ విషం చిమ్మిందనీ, అభివృద్ధిలో ప్రధాన ప్రతిపక్షం సహకరించకపోగా, ప్రతీ సందర్భంలోనూ అవహేళన చేసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. హైడ్రా, మూసీ విషయంలో ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోకుండా సహాయ నిరాకరణ చేస్తున్నారనీ, ఆయన వల్లే రాష్ట్ర అభివృద్ధికి విఘాతం ఏర్పడుతున్నదని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తానే అభ్యర్థిగా మారి పనిచేస్తే 17 వేల ఓట్లు వచ్చాయనీ, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉందన్న విషయాన్ని గమనించాలని సూచించారు. ఈ ఫలితాల తర్వాత అయినా కేంద్రమంత్రి తన వ్యవహారశైలి మార్చుకోవాలని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం భూకంపం మిగితా 4వ పేజీలో

## రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే




- జూబ్లీహిల్స్ ఫలితం నిరుత్సాహపరిచింది
- ప్రతిపక్షంగా పోరాటం కొనసాగిస్తాం
- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- ఓటేసిన ప్రజలకు, అవిశ్రాంతంగా కృషి చేసిన నాయకులకు ధన్యవాదాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ఫలితంపై స్పందిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్? మాట్లాడుతూ.. ఎన్నికల కోసం ఎంతో కష్టపడిన ప్రతి ఒక్క పార్టీ కార్యకర్తకు, బూత్ స్థాయి నాయకులకు, శ్రేణులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మా అభ్యర్థి మాగంటి సునీత గారికి రాజకీయ అనుభవం లేకపోయినా కష్టపడి పోరాడారని అభినందించారు. పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్క ఓటరుకు, ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల్లో పార్టీకి గణనీయమైన ఓటు శాతం నమోదు అయిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఎన్నిక కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని, స్పష్టమైన ప్రత్యామ్నాయం భారత రాష్ట్ర సమితి అని ప్రజలు తీర్పునిచ్చారని, ఈ అంశాన్ని పార్టీ సానుకూలంగా పరిగణిస్తోందని అన్నారు.

గత రెండు సంవత్సరాలుగా ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ, ఎన్నికల్లో పార్టీ నిజాయితీగా, చిత్తశుద్ధిగా పోరాడిందని వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను, ఆరు గ్యారెంటీల అమలును, ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోయామని తెలిపారు. కుల, మత రాజకీయాలు చేయకుండా, ప్రజలకు అవసరమైన అంశాలను మాత్రమే ప్రచారంలో చర్చకు పెట్టామని పేర్కొన్నారు. 10 సంవత్సరాల పాలనలో తాము చేసిన రూ. 5300 కోట్ల అభివృద్ధిని ప్రజల ముందుంచామని, మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎగ్గొట్టిన ప్రతి అంశాన్ని 'బాకీ కార్డు' రూపంలో ప్రజల ముందుకు తీసుకుపోయామని వివరించారు. తమ ఒత్తిడి కారణంగానే ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీల అమలుపై సమీక్ష చేసే పరిస్థితి వచ్చిందని, మైనారిటీలకు మంత్రివర్గంలో స్థానం లేదని, ఆటోలకు అన్యాయం జరుగుతోందని గళమెత్తితే ప్రభుత్వం ఒత్తిడికి లోనై స్థానం కల్పించాల్సి వచ్చిందని అన్నారు. ఎన్నికలు జరిగిన తీరుపై ప్రజల్లో, మీడియాలో చర్చ జరగాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడిందని, దొంగ ఓట్ల పంపిణీ జరిగిందని, ఈ అంశాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసినా, ఎన్నికల కమిషన్, పోలీసుల పనితీరుపైనా చర్చ జరగాలని కోరారు.

ప్రజా తీర్పుని గౌరవిస్తామని, ఎన్నికల ఫలితంపై ఆత్మ విమర్శ చేసుకుంటామని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ పనిని కొనసాగిస్తూనే ఉంటామని, "ప్రజలతోనే ఉంటాం. ప్రజల కోసమే ఉంటాము. ప్రజల్లోనే ఉంటాం. తిరిగి కేసీఆర్ గారిని ముఖ్యమంత్రి చేసుకునేదాకా పోరాటం చేస్తూనే ఉంటాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌లో ఉండి బీజేపీ డిపాజిట్ కోల్పోయిందని, బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయం ఫలించినట్టుగా కనిపిస్తోందని విమర్శించారు. మిగితా 4వ పేజీలో

## ఎన్నికలు న్యాయంగా జరగలేదు

- బీహార్ ఫలితాలపై లోతుగా చర్చిస్తాం
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పందించారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి కూడా న్యాయంగా జరగలేదనీ, అందుకే విజయం సాధించలేకపోయామని ఆరోపించారు. ఫలితాలు ఆశ్చర్యకరంగా వచ్చాయని పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఆయన తెలిపారు. ఫలితాలపై కాంగ్రెస్, ఇండియా బ్లాక్ లోతైన సమీక్ష జరుపుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము మరింతగా కృషి చేస్తామని వివరించారు. మహాగట్‌బంధన్ కూటమి పట్ల విశ్వాసం ఉంచిన లక్షలాది మంది బీహార్ ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బీహార్ ప్రజల నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే శక్తుల పట్ల తాము పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఎన్నికల ఫలితాలపై సమగ్ర అధ్యయనం జరుపుతామని వివరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని ఎక్స్‌లో రాసుకొచ్చారు. ప్రజల్లో ఉంటూ.. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మన పోరాటం కొనసాగుతుందని వివరించారు. తమ పోరాటం నిబద్ధతతో కూడుకొని ఉంటుందని పేర్కొన్నారు.

## మజ్లిస్ అండతోనే కాంగ్రెస్ గెలిచింది

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ అండదండలతో గెలుపొందిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఉపఎన్నికల్లో సాధారణంగా అధికార పార్టీకే ప్రయోజనం ఉంటుందని తాను ముందే చెప్పానని డిల్లీ నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. "జూబ్లీహిల్స్‌లో మేమెప్పుడూ గెలవలేదు. కార్పొరేటర్ స్థాయిలో కూడా విజయం సాధించలేదు. అయినప్పటికీ పార్టీగా మా బాధ్యతను నిర్వర్తించాం. బీజేపీ ఎంపీ పరిధిలో వస్తున్నందున ఈసారి ప్రత్యేకంగా కృషి చేశాం," అని కిషన్‌రెడ్డి తెలిపారు.పోలింగ్‌కు ముందు, బూత్‌ల వద్ద కోట్లాది రూపాయలు పట్టుబడ్డాయని, వాటి వెనకడే కాంగ్రెస్-బీఆర్ఎస్ నాయకుల ప్రమేయం ఉందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. "డబ్బులిచ్చి కాంగ్రెస్ గెలిచింది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం," అని విమర్శించారు. ఈ నియోజకవర్గంలో సమస్యలు యథాతథంగానే ఉండగా రేవంత్ రెడ్డి చేసిందేమిటని ప్రశ్నించారు. "ప్రజలు అభివృద్ధి చూసి కాదు డబ్బులిచ్చి కాంగ్రెస్ గెలిచింది," అని ఆయన మండిపడ్డారు. ఈవీఎంలు బీహార్లో పనిచేయలేదా? లేక జూబ్లీహిల్స్‌లో మాత్రమే సరిగ్గా పనిచేశాయా? అనే ప్రశ్నకు రాహుల్ గాంధీ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు."అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు గెలిచిన మేము పార్లమెంట్ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు సాధించాం. మా విశ్లేషణ ప్రకారం 57 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ప్రభావం గణనీయంగా పెరిగింది. తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3లో 2 స్థానాలు గెలిచాం. గ్రామీణ యువత, ఉపాధ్యాయుల మద్దతు మా బలంగా మారింది," అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ విస్తరణ రాబోయే రోజుల్లో వేగవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## హైడ్రాపై రోజుకు పది పిటిషన్లు వస్తున్నాయి.

- కోర్టు ఆదేశాలు పాటించని హైడ్రా
- హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

బలగం టీవీ, హైదరాబాద్

కోర్టు ఆదేశాలను హైడ్రా పాటించడం లేదని తెలంగాణ హైకోర్టు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కోర్టు అధికారం చూపాల్సి వస్తుందని స్పష్టం చేసింది. తుమ్మిడికుంట చెరువు పునరుద్ధరణకు సంబంధించి ఇతర భూముల్లో యథాస్థితి కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. హైడ్రా కోర్టు ఆదేశాలను ధిక్కరించి పనులు చేపట్టిందంటూ దాఖలైన ధిక్కరణ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. కోర్టు ఆదేశాల మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆన్‌లైన్‌లో విచారణకు హాజరయ్యారు. జస్టిస్ విజయసేన్ రెడ్డి బెంచ్ ఈ సందర్భంగా హైడ్రా వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "హైడ్రా పై రోజుకు పది పిటిషన్లు వస్తున్నాయి. ప్రజలకు మేలు జరిగే పనులు చేయాలి. ఎంపిక చేసుకుని చర్యలు చేపట్టడం మంచిది కాదు," మిగితా 4వ పేజీలో

## బిహార్‌లో ఎన్‌డీఏ అఖండ విజయం

- 243లో 203 స్థానాలు కైవసం
- మహాగట్ బంధన్‌కు 34 సీట్లకే పరిమితం.. ఘోర పరాభవం
- ఖాతా తెరవని ప్రశాంత్ కిషోర్ పార్టీ



బలగం టీవి, పాట్నా

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్‌డీఏ కూటమి ప్రళయవిజయం సాధించింది. మొత్తం 243 స్థానాల్లో 203 స్థానాలు గెలుచుకుని అఖండ మెజార్టీని నమోదు చేసింది. ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌ను ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు. విపక్ష కూటమి కేవలం 34 స్థానాలకు పరిమితమై తీవ్ర నిరాశకు గురైంది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఏర్పాటు చేసిన జనసూరజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది.

అభివృద్ధి నినాదమే మరోసారి బిహార్ ప్రజలకు నచ్చింది. సాధారణ మెజార్టీకి 122 స్థానాలు అవసరమైన ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ 203 స్థానాలను సొంతం చేసుకుంది. ఎన్‌డీఏ కూటమిగా బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ-రామ్‌విలాస్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌మోర్చా పార్టీలు పోటీ చేశాయి.

ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ తారాపూర్‌లో 45,843 ఓట్ల మెజార్టీతో గెలిచారు. డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్‌లో విజయం సాధించారు. దానాపూర్‌లో రామ్ కృపాల్ యాదవ్ 29,133 మెజార్టీతో గెలిచారు. జానపద గాయని మైథిలీ ఠాకూర్ అలీనగర్ నుంచి విజయం సాధించడం విశేషం. హత్య కేసులో జైల్లో ఉన్నప్పటికీ జేడీయూ అభ్యర్థి అనంత్ కుమార్ సింగ్ మొకామాలో 28,000 పైచిలుకు మెజార్టీతో గెలిచారు.

ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్ ఘోరంగా పరాజయం పాలైంది. మొత్తం 34 స్థానాల్లో మాత్రమే నిలదొక్కుకుంది. 143 స్థానాల్లో పోటీ చేసిన ఆర్‌జేడీ 24 స్థానాలు మాత్రమే సాధించింది. అయితే ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ రాఘోపూర్‌లో 14,000 పైగా మెజార్టీతో వరుసగా మూడోసారి గెలిచారు. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మహువా నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం ముస్లిం మెజారిటీ ప్రాంతాల్లో ప్రభావం చూపి ఐదు స్థానాలు గెలుచుకుంది. బహుజన్ సమాజ్ పార్టీ ఒక స్థానంలో విజయం సాధించింది.

ప్రధాన పార్టీలైన బీజేపీ, జేడీ(యూ)లు చెరో 101 స్థానాల్లో పోటీ చేశాయి. ఇందులో బీజేపీ 90, జేడీయూ 84 సీట్లలో విజయ ం సాధించాయి. ఎన్డీఏలోని ఇతర పార్టీలు ఎల్జేపీ (ఆర్వీ) 19, హెచ్ఏఎం(ఎస్) ఐదు, ఆర్ఎల్ఎం నాలుగు స్థానాలను కైవసం చేసుకున్నాయి. దీంతో రాష్ట్రంలో మరోసారి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మార్గం సుగమమైంది. ఎన్డీఏ విజయంతో కూటమిలోని పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. బీజేపీ, జేడీ(యూ),

ఎల్జేపీ(ఆర్వీ) నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నా రు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ నేతృత్వంలో ముందుకెళ్లిన మహాగట్‌బ ఒధన్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. కూటమిలో కీలక పార్టీగా ఉన్న ఆర్జేడీ 25 స్థానాల్లోనే విజయం సాధించింది. కాంగ్రెస్ ఆరు నియోజకవర్గాలకే మిగితా 4వ పేజీలో

## డిసెంబర్ 8న వైభవంగా రెండో వార్షికోత్సవం



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 8 వ తేదీన రెండో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధికి సాధించాలన్న లక్ష్యంతో రూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రాన్ని వచ్చే డిసెంబర్ 9 వ తేదీన ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రోడ్ మ్యాప్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 నిర్వహణ తదితర అంశాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి గారు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రూపొందించే పాలసీ ఆధారంగానే భవిష్యత్తు నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, విధానపరమైన ప్రణాళిక ఉంటే పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుందని చెప్పారు.పాలసీ డాక్యుమెంట్ ప్రభుత్వంలోని శాఖల వారిగా ఉండాలని, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 లో ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా శాఖల వారిగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం కావాలని చెప్పారు.

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, సంబంధిత ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు ఉప ముఖ్యమంత్రి గారు సమీక్షలు నిర్వహిస్తారని, సమ్మిట్‌ను విజయవంతం చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించాలని, అలాగే అందుకు తగిన విధంగా భద్రత విషయంలో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, డీజీపీ శివధర్ రెడ్డి గారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎవరెస్ట్ అధిరోహకురాలు మలావత్ పూర్ణకు పితృవియోగం..



- పరామర్శించిన బలగం టీవీ సీఈఓ బాలు కాయితి..

బలగం టీవీ, నిజామాబాద్

మలావత్ పూర్ణ 13 సంవత్సరాల 11 నెలల వయసులోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి ప్రపంచ రికార్డు సృష్టించారు. అతి చిన్న వయసులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ, గిరిపుత్రిక మలావత్ పూర్ణ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆమె తండ్రి, మలావత్ దేవిదాస్ (50) అనారోగ్యంతో కన్నుమూశారు.

నిజామాబాద్ జిల్లా, సిరికొండ మండలం, పాకాల గ్రామంలో నివసించే మలావత్ దేవిదాస్ గారు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ, ఎంతో కష్టపడి తన కూతురు పూర్ణను ప్రపంచ స్థాయి పర్వతారోహకురాలిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఈ విషాద వార్త తెలుసుకున్న బలగం టీవీ సీఈఓ బాలు కాయితి స్వయంగా పాకాల గ్రామానికి వెళ్లి పూర్ణ కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన దేవిదాస్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పూర్ణకు ధైర్యం చెప్పి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

www. balagamtv.com
రాజన్న సిరిసిల్ల | కరీంనగర్ | పెద్దపల్లి
బలగం BALAGAM TV
శనివారం
15 నవంబర్ 2025


# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **జీజీహెచ్ సిరిసిల్లపై సమీక్ష సమావేశం..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ రోజూ ఓపీ, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

వివిధ వార్డుల్లో రూఫ్ లీకేజీకి మరమ్మత్తు పనులు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు ఆధునీకరణ, పెయింటింగ్, ఏసీ, మరుగుదొడ్ల మరమ్మత్తు, మెష్ డోర్స్ ఏర్పాటు, మెటర్నిటీ వార్డులోని ఓపీ వద్ద పెయింటింగ్, మెష్ డోర్స్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇంకా ఔట్ పేషెంట్ మేల్ వార్డు మందులు తీసుకునే వద్ద షెడ్ ఏర్పాటు, అదనంగా నల్లా కనెక్షన్లు, ఆక్సిజన్ స్టోరేజ్ గదిలో పలు అభివృద్ధి పై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సభ్యత్వ నమోదు పెంచాలని, వైద్యులు, సిబ్బంది, ఆయా శాఖల అధికారులతో నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జీ జీ హెచ్ సూపరింటెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ సూపరింటెంట్ డాక్టర్ చికోటి సంతోష్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత, డీసీ హెచ్ ఎస్ డాక్టర్ పెంచలయ్య, వైద్యులు ఆవాస్ గౌరీ, ఎం లక్ష్మీనారాయణ, సుగుణ ప్రసాద్, ఐఎంఏ ప్రెసిడెంట్ శోభారాణి, ఆర్ ఎం ఓ డాక్టర్ కపిల్ సాయి, లయన్స్ క్లబ్ బాధ్యులు నాగుల సంతోష్, రెడ్ క్రాస్ బాధ్యులు వేణు, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యూ డైస్, అపార్ అప్డేట్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **కేజీబీవీల్లో కావాల్సిన వసతులపై ఆరా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
అన్ని విద్యాలయాల్లో యూ డైస్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యూ డైస్, అపార్, రెసిడెన్షియల్ విద్యాలయాలు, కేజీబీవీ లు తదితర అంశాలపై కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ విద్యాలయాలు 628 ఉన్నాయని, అన్ని స్కూళ్లలో యూ డైస్ ప్రక్రియ, అపార్ అప్డేట్ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బర్త్ సర్టిఫికెట్ జారీలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత ఆర్డీవో, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రక్రియ వంద శాతం పూర్తి చేస్తే ప్రతి ప్రభుత్వ పథకం అమలు, వసతుల కల్పన, సిబ్బంది నియామకం, నిధుల మంజూరుకు ఎంతో కీలకమని తెలిపారు. స్కూల్స్, కాలేజీల బాధ్యులు ప్రణాళిక ప్రకారం పనిని పూర్తి చేయాలని ఆదేశించారు.



ఇటుక బట్టిలు, రైస్ మిల్లులు, క్వారీలు తదితర స్థలాల్లో పనిచేస్తున్న కూలీల పిల్లలకు వర్క్ సైట్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, ఆ పిల్లలకు విద్యను అందించాలని, కావలసిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బాల కార్మికులు, బిక్షాటన చేస్తూ పిల్లలు కనిపించకూడదని స్పష్టం చేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? కావాల్సిన వసతుల పై ఆరా తీశారు. పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యాలయంలో సీసీ కెమెరా పెట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, డీటీ డబ్ల్యూఓ సంగీత, జీసీడీఓ పద్మజ, మైనార్టీ సంక్షేమ అధికారి భారతి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కేజీబీవీల ఎస్ఓలు, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

# 'పీటీఏ' సమావేశానికి హాజరైన ఆర్‌జేడీ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరిసిల్లలో జరిగిన తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ వరంగల్ సత్యనారాయణ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం గుణాత్మక విద్య కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా, అన్ని పాఠశాలల్లో డిజిటల్ లిటరసీ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ వినియోగాన్ని తప్పనిసరి చేసిందని, ఖాన్ అకాడమీ వంటి సంస్థలతో భాగస్వామ్యం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఐఎఫ్పీ ప్యానల్ టీవీల ద్వారా బోధిస్తున్నారని, కంప్యూటర్ విద్యను కూడా తప్పనిసరి చేశారని తెలియజేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే, ఉపాధ్యాయులు బోధించిన అంశాలను ఇంటి వద్ద తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయవలసిందిగా ఆర్‌జేడీ ప్రత్యేకంగా కోరారు. విద్యార్థులు తమ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, అప్పుడే వారికి విషయాలు స్పష్టంగా అర్థమై, మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు, అక్టోబర్ నెల నుండే సాయంత్రం స్టడీ అవర్స్ ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ స్టడీ అవర్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థులందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ను ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి గారు తిలకించారు. విద్యార్థులతో ముచ్చటించి, సైన్స్ ఎగ్జిబిట్‌లను పరిశీలించి వాటి గురించి వివరించమని కోరారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంతో పాటు సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు పాఠశాలలోని కార్యక్రమాలను చక్కగా వివరించడం వలన వారిలో పాఠశాల పట్ల మంచి నమ్మకం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు బైరి రవీందర్, తూముల తిరుపతి, వడాల రవీందర్, బి గోపి, రమాదేవి, రాజగోపాల్ రెడ్డి, లింగంపల్లి దేవిడ్సన్, విజయ, రాజేశం, నిరోషా, విజయలక్ష్మి, నందిని, మేఘన, అనిల్ రాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ప్రజలకు డయాబెటిస్ పై డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత కీలక సూచనలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత రాజన్న సిరిసిల్ల ప్రజలకు డయాబెటిస్ వ్యాధి గురించి పలు కీలక సూచనలు చేశారు. డాక్టర్ రజిత మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం 12,150 మంది డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. వీరందరూ భయపడాల్సిన అవసరం లేదని, సకాలంలో వైద్యులను సంప్రదించి, మందులు వాడుతూ, వారి సలహాలు, సూచనలు తప్పక పాటించాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోమంచి మందులు అందుబాటులో ఉన్నాయి, వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలి. గుండె, కంటి మరియు కిడ్నీ పరీక్షలను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా చేయించుకోవాలి. డయాబెటిస్ రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి, తగినంత శరీరక శ్రమ ఉండాలి. ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. పౌష్టికాహార లోపం వల్ల కూడా డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది కాబట్టి, సమతుల ఆహారం తీసుకోవాలి. ఓట్స్, దంపుడు బియ్యం (బ్రౌన్ రైస్), తాజా కూరగాయలు, మరియు పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. కూల్ డ్రింక్స్, తీపి పదార్థాలు, మరియు అతిగా నూనెలు వాడిన వంటకాలకు దూరంగా ఉండాలి. డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవాలి. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్నందున, ఉన్ని దుస్తులు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ రజిత ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేశారు. డయాబెటిస్ పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన 57 మందికి జరిమానాలు..

- **మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు జాగ్రత్త..**
- **సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ**

**బలగం టీవీ, సిరిసిల్ల**
సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 57 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పట్టణ పోలీసులు శుక్రవారం రోజున కోర్టులో ప్రవేశపెట్టగా 57 మంది మందు బాబులకు జరిమానాలు విధిస్తు మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు. 02 కి ఒక్కొక్కరికి 6000/- రూపాయలు జరిమానా, 12 మందికి ఒక్కొక్కరికి 5000/- రూపాయల జరిమాన, ఒక్కరికి 4000/- రూపాయల జరిమాన, 42 మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా మొత్తం 57 మందికి జరిమానాలు విధించారు.

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ.. ప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని,ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నైతికంగా గెలిచింది బీఆర్ఎస్

## మాగంటి సునీత



**బలగం టీవీ, హైదరాబాద్:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో గెలిచిందని, ఈ విజయం నైతికమైనది కాదని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్ చేసి విజయం సాధించిందని, నైతికంగా మాత్రం బీఆర్ఎస్ గెలిచిందని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అప్రజాస్వామికంగా జరిగిందని సునీత అన్నారు. రౌడీలతో భయపెట్టి ఓట్లు వేయించుకున్నారని, ఈ ఎన్నికతో రౌడీ రాజ్యం మొదలైందని ఆమె మండిపడ్డారు. "రిగ్గింగ్ చేసి గెలవడం గెలుపే కాదు," అని ఆమె అన్నారు. ప్రతి చోటా రిగ్గింగ్ జరగడం వల్లే అన్ని రౌండ్లలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం కనబరచిందని ఆరోపించారు. నలుగురు, ఐదుగురు పార్టీలు కలిసి తమపై కుట్ర చేసి గెలిచారని, ఇది నిజమైన గెలుపు కాదని అన్నారు. తనపై మరియు కౌంటింగ్ కేంద్రంలో తమ మహిళా మద్దతుదారులపై ర్యాగింగ్ చేశారని, కట్టుకున్న చీరలపైన కూడా ర్యాగింగ్ చేశారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. "ఆడబిడ్డ పైన ఎంత చెయ్యాలో అంత చేశారు," అంటూ దుయ్యబట్టారు. దివంగత మాగంటి గోపినాథ్ ఉన్నంత కాలం రౌడీలు అలుగులో దాక్కున్నారని, ఇప్పుడు వారు బయటకు వచ్చి బిల్డప్ ఇస్తున్నారని, జూబ్లీహిల్స్‌లో అప్పుడే రౌడీయిజం మొదలైందని ఆమె పేర్కొన్నారు. కేసీఆర్ ప్రచారం చెయ్యకపోవడం వల్లనే ఓడిపోయామని తాను అనుకోవడం లేదని ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, కాంగ్రెస్ గెలుపు రిగ్గింగ్, రౌడీయిజంతో కూడినదని మాగంటి సునీత విమర్శించారు.

## నేలకొరిగిన సాహితీ శిఖరం..


పత్తిపాటి మంజుల

మాయమవుతున్నాడమ్మాజి
మనీషన్నవాడు అంటూ
నేటి సమాజ దుస్థితి తెలిపిన
నవోదయుడు,మనిషి బతుకు చుట్టూ ఉన్న చీకటిని తన గొంతునుంచి ఆశువుగా వల్లె వేసి
పాట రూపంలో పాడిన చైతన్య కారుడు.తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించి, పాడిన తెలంగాణా ఉద్యమ సూర్యుడు,తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకమైవెలుగు రేఖలను నింపిన ఉదయతేజుడు.తన గెయాలతో జన హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన పాటసారి చదువు కుంటెనే కవిత్వం కాదు, చదువుకు కవిత్వానికి సంబంధము లేదు అని తెలిపిన బాటసారి మా అందే ఎల్లయ్య మా అందరి గుండెల్లో నీవయ్య. ఆ మహానుభావుని ఆత్మ శాంతించాలని, అక్షర అశ్రు నయనాలతో నివాళి.

**- ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తిపాటి మంజుల**



## దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాచారంలో మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి వారి యొక్క అనుభూతిని తెలియజేయడం జరిగింది. డిఈఓ గా పల్లె సాత్విక్, ప్రధానోపాధ్యాయులుగా అల్వాల అను, వ్యవహరించడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణి విద్యార్థి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్ రెడ్డి, శ్రీను, ఆనంద్, శ్రీనివాస్,దావీద్, సురేష్ సంజీవ్, శ్రావణ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో అన్నంలో కాలు పెట్టి నిద్రించిన వాచ్‌మెన్..

### విధుల నుండి తొలగించిన కలెక్టర్..!

**బలగం టీవీ, మెదక్:**



మెదక్ జిల్లాలోని సంగారెడ్డి మండలం, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఓ విస్మయకర సంఘటన చోటు చేసుకుంది. కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మద్యం మత్తులో తూలి, అత్యంత అమానవీయంగా ప్రవర్తించాడు. ఈ వాచ్‌మెన్ కళాశాల క్యాంటీన్ లేదా భోజనం నిల్వ ఉంచే ప్రాంతంలో పప్పు/కూరతో పాటు అన్నం వండి ఉంచిన పాత్ర (గిన్నె) లోకి తన కాలును పెట్టి, అక్కడే నిద్రలోకి జారుకున్నాడు. ఆహారానికి సంబంధించిన ప్రాథమిక శుభ్రతను కూడా పాటించకుండా, బాధ్యతారహితంగా వ్యవహరించిన ఈ దృశ్యం కలకలం సృష్టించింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లతో సహా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం ఏ మాత్రం సహించరానిదని అధికారులు భావించారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్, ఆ వాచ్‌మెన్‌ను విధులలో నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే సిబ్బందికి బాధ్యత, క్రమశిక్షణ తప్పనిసరి అని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ..

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి తల్లి పెండ్యాల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించిన చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం.

# సహకార సంఘాలు అభివృద్ధి పథంలో నడవాలి..

- **ఎల్లారెడ్డిపేట సహకార సంఘ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి**
- **ఎల్లారెడ్డిపేట సహకార సంఘ భవనంపై సహకార జెండా ఎగురవేత**




**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఎల్లారెడ్డిపేట సహకార సంఘ భవనంపై సంఘ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి శుక్రవారం సహకార జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార సంఘాలు ఎల్లప్పుడూ అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. సహకార సంఘాల పాత్రను వివరిస్తూ, భారతదేశంలో గ్రామాల అభివృద్ధిలో సహకార సంఘాలది చాలా గొప్ప పాత్ర అని ఆయన కొనియాడారు. ఈ సంఘాల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు నేవూరి వెంకట నరసింహారెడ్డి, ల్యాగాల సతీష్, సంఘ సెక్రటరీ కిషోర్ కుమార్, సంఘ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రథమ వార్షికోత్సవ సభ..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రంగవల్లి 26 వ వర్ధంతి సందర్భంగా రంగవల్లి విద్యానకేంద్రం ప్రథమ వార్షికోత్సవ సభ విజయవంతంగా జరిగింది. దీనికి ముందు నంది కమాన్ నుండి రంగవల్లి విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. తర్వాత రంగవల్లి, తదితర అమరవీరులకు నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రంగవల్లి స్మారక ఉపన్యాసకులుగా, సంక్షోభ కాలం-సామాజిక మార్పుపై ప్రొఫెసర్ కొల్లాపురం విమల, ప్రజా గ్రంధాలయాల ఆవశ్యకతపై కవి: జూకంటి జగన్నాథం లు మాట్లాడారు. సభ ప్రారంభానికి ముందు రంగవల్లి విజ్ఞాన కేంద్రం సభ్యులు పోకల సాయికుమార్ సభా పరిచయం చేశారు. రెండు సెషన్లకు విమలక్క, రాజేశ్వరీ అధ్యక్షత వహించారు. పురుషోత్తమరావు వందన సమర్పణ చేశారు.రచయిత్రి, సామాజిక ఉద్యమకారిని ప్రొఫెసర్ కొల్లాపురం విమల గారు మాట్లాడుతూ.. ఒక మహిళ పేరు మీద విజ్ఞాన కేంద్రం ఉండడం సంతోషకరమని అన్నారు. రంగవల్లి తదితర అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటం కాలంలో గ్రంధాలయ పాత్రను వివరించారు.తమకోసం కాకుండా పేద ప్రజల కోసం పోరాడినారని కొనియాడినారు.దోపిడీ, పీడన,అసమానతలు రద్దుకావాలని కోరుకున్నారన్నారని గుర్తు చేశారు.నాడు భూస్వాములకు, దొరలకు,దోపిడీ దారుల ఆగడాలకు చరమగీతం పాడడంలో ప్రజలు ముందు వరుసలో వున్నారని గుర్తు చేశారు.సమస్త ప్రజల సమస్యల పరిష్కారంకై పోరాటమే ఏకైక మార్గమన్నారు.

ప్రముఖ కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ.. ప్రపంచంలో పుస్తకాలు ఇప్పటికీ చిరంజీవి గానే ఉన్నాయన్నారు. ప్రజాసాహిత్యం ప్రజల కొరకు పనిచేస్తుందన్నారు.ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని గ్రంధాలయాలు నేర్పుతాయన్నారు.ప్రజా గ్రంథాలయాలు మార్పు కోసం పనిచేస్తాయని కొనియాడారు. అమరులు ఈ సమాజానికి ఒక దిక్సూచిగా నిలిచినారు అని కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే ఆలోచనలు గ్రంథాలయాల వల్ల ఎన్నో పుట్టుకొస్తాయని అన్నారు. గ్రంథాలయాల నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రంగ వల్లి విజ్ఞాన కేంద్రం నాయకులు: పోకల సాయికుమార్, రాజేశ్వరి, చెన్నమ నేని పురుషోత్తం రావు, నరాల దేవేందర్, రైతు- కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, AIFTU రాష్ట్ర నాయకులు రాయమల్లు, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నాయకులు వంగాల సంతోష్, తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు అనసూయ, లక్ష్మి, వెంకటలక్ష్మి, TPTF రాష్ట్ర నాయకులు అనిల్, CPI నాయకులు వేణు, ప్రకాష్,మరియు డేగల రమ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు మోసం చేయకుండా చర్యలు తీసుకోవాలి..

- **సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూశం రమేష్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల బివై నగర్‌లో అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఐకెపి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి, గన్నిసంచులు అందుబాటులో ఉంచాలని కోరారు. రైస్ మిల్లర్లు రైతుల వద్ద నుండి ప్రతి సంచికి రెండు నుండి మూడు కిలోల వరకు అదనంగా ధాన్యం తీసుకుంటూ దోపిడీ చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. గత సీజన్‌లో సేకరించిన సన్నబియ్యానికి బోనస్‌ను ప్రభుత్వం తక్షణమే అందించాలని, అలాగే ధాన్యం కొనుగోలు ఆలస్యం వల్ల రైతులు వర్షాల భయంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు తేమ పేరుతో ఒక కింటకు 8 కిలోల వరకు కోతలు విధిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని, ఇలాంటి మోసగాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైస్ మిల్లుల లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, కోడం రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నారం నరసయ్య, సూరం పద్మ, గురుజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు కూడా హాజరయ్యారు.

## వాణీనికేతన్ హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**



ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారతదేశ తొలి ప్రధానమంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రు జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలను బోధించారు. నేటి బాలలే భావి భారత పౌరులను ఉపాధ్యాయుల పేర్కొన్నారు. దేశ భవిష్యత్ తరగతి గదులలోనే రూపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, సంతోష్, రాజు, తిరుపతి, రాజు, సుమంగళి, శోభ, రేఖ, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, రేణుక, షమీమా, జలజ, శాంత, పద్మ, రేణుక, సునీత, స్వాతి, మహాలక్ష్మితోపాటు తాత్కాలిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే వరదలు, నీటి ముంపు నుంచి రక్షణ..

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్
- సిరిసిల్ల మానేరు తీరంలో అవగాహన సదస్సు



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

అవగాహనతోనే వరదలు, నీటి ముంపు నుంచి రక్షణ పొందవచ్చని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. కమ్యూనిటీ అవేర్ నెస్ లో భాగంగా భారత ప్రభుత్వం, హెూమ్ శాఖ ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖ ఆద్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని మానేరు తీరంలో మాక్ డ్రిల్ నిర్వహించగా, ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా విహారయాత్ర లకు వెళ్లే పర్యాటకులు, సరదాగా నదీ తీరాల్లో విహరించే వారు, ఈత రాని వారు నీళ్ళల్లో మునిగి పోయినప్పుడు డ్రిల్ చూపించిన విధంగా చేస్తే ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. వరదలు సంభవించినప్పుడు, ఆకస్మాతుగా నీరు పట్టణాలు, గ్రామాల్లోకి వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీ బాటిల్స్, క్యాన్స్, థెర్మాకోల్ షీట్స్, ప్లాస్టిక్ బిందెలు ఎండిన కొబ్బరి బొండాలు మొదలగునవి ఉపయోగించి నీటిలో తెలియాడే పద్దతులు తెలియజేశారు. నీటిలో మునిగి పోతున్న వ్యక్తి ని ఎలా లాక్కు రావాలి అని వివిధ పద్దతులలో చూపించారు. బయటకు తీసుకు వచ్చిన వ్యక్తికి సీ పీ ఆర్, కృత్రిమ శ్వాస ఎలా కల్పించాలి, నీరు ఎలా బయటికి రప్పించాలో ప్రాక్టికల్ గా చూపించారు.

అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఆపద సమయంలో ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అవగాహన పొందిన వారు తమ కుటుంబ సభ్యులు, సమీప ప్రజలకు వివరించాలని పిలుపుఇచ్చారు. చాలా చక్కగా మాక్ డ్రిల్ చేసిన ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ గౌతం, జిల్లా అగ్ని మాపకశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఏఓ అఫ్జల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, అధికారులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ స్టూడెంట్స్, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



## శాంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినగర్‌లో పోకల భవాని, బిజెపి పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో ఈరోజు ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. సరయు హాస్పిటల్ సహకారంతో జరిగిన ఈ శిబిరానికి డాక్టర్ టి. రవళి, డాక్టర్ టి. సాయికుమార్ లు పర్యవేక్షణ వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మరియు పిల్లలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. బాలల దినోత్సవం సందర్భంగా బాలలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతోనే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే, మహిళలందరికీ కూడా వైద్య పరీక్షలు చేసి తగు మందులు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన డాక్టర్ టి. రవళి, డాక్టర్ టి. సాయికుమార్ గార్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న శాంతినగర్ ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడప సంతోష్, వడ్నాల శేఖర్ బాబు, వెలిశాల అభినయ్, కొంపెల్లి విజయ్ రామారావు, సోమిశెట్టి పూజిత, చోడబోయిన కౌసల్య, కమటం మంజుల, చెవిటి మల్లీశ్వరి, సువర్ణ సౌజన్య రూప మహిళా బృంద సభ్యులు సహా పలువురు ప్రముఖులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రెండేండ్ల పాలనపై ప్రజా తీర్పు ఇది

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే ముందు వచ్చే అలర్ట్ లాంటిదనీ, గమనించకుంటే కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభివృద్ధికి సహకరించాలనీ, ఆయన్ని రాష్ట్ర సచివాలయానికి సాదరంగా ఆహ్వానిస్తున్నానని చెప్పారు.

కేంద్రం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులపై చర్చిద్దామనీ, దీనికి సంబంధించి సమీక్ష నిర్వహించి, నివేదిక రూపంలో రాష్ట్ర ఎంపీలకు ఇవ్వాలని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాల తర్వాతైనా బీఆర్ఎస్ నాయకులు టీ హరీశ్‌రావు అసూయను, ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అహంకారాన్ని తగ్గించుకోవాలని సలహా ఇచ్చారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనీ, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల శాతంతో పోల్చితే, బీఆర్ఎస్, బీజేపీ రెండింటికీ కలిపినా అన్ని ఓట్లు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు వారి అసూయ, అహంకారాన్ని గమనిస్తున్నారనీ, సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేండ్లు ఉందనీ, వచ్చే రెండేండ్లు అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలనీ, సమస్యలు ఉంటే ప్రశ్నించి, ధర్నాలు చేయాలని సూచించారు. 'మీ సోషల్ మీడియాలో మీరు చెప్పిందే రాస్తారు. అదే నిజమని మీరే భ్రమల్లోకి వెళితే ఎలా?' అని ప్రశ్నించారు. వ్యాపార దృక్పథంతో కొన్ని మీడియా సంస్థలు తప్పుడు సమాచారం వ్యాప్తిచేస్తున్నాయనీ, కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నా కొన్ని ఛానళ్లు బీఆర్ఎస్ హవా మొదలైందని వార్తలు వేశాయని వ్యంగ్యంగా అన్నారు. మీడియా చానల్స్ దయచేసి విశ్వసనీయతను కోల్పోవద్దనీ, తమపై ఏదైనా వ్యతిరేకత ఉంటే మరోరకంగా చూపించాలని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరుగుతూ వస్తోందని తెలిపారు. 2023 ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చాయనీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు రాగా, ఇప్పుడు 51 శాతం ఓట్లు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇచ్చారని విశ్లేషించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో లేరనీ, ఆయన ఆరోగ్యం కూడా సరిగా ఉన్నట్టు లేదన్నారు. ఆయనపై తనకు సానుభూతి మాత్రమే ఉందనీ, ఆయన గురించి ఏం మాట్లాడబోనని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు.

# బిహార్‌లో ఎన్‌డీఏ అఖండ విజయం

(మొదటి పేజీ తరువాయి)

పరిమితమైంది. ఈ కూటమిలోని వామపక్ష పార్టీలు మూడు సీట్లను చేజిక్కించుకున్నాయి. సీపీఐ(ఎం) ఒక స్థానాన్ని, సీపీఐ ఎంఎల్(ఎల్) రెండు సీట్లను దక్కించుకు న్నాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మహాగట్‌బంధన్ కూటమి 114 స్థానాల్లో విజయం సాధించగా.. ఈ సారి అందులో సగం కూడా దక్కించు కోకపోవడం గమనార్హం.

## హైడ్రాపై రోజుకు పది పిటిషన్లు వస్తున్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

అని వ్యాఖ్యానించింది.

**జీవ వ్యర్థాలే తొలగించాం : కమిషనర్ రంగనాథ్**

చెరువులో జీవ వ్యర్థాలను మాత్రమే తొలగించామని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పునరుద్ధరణ పనులు చేపట్టామని కమిషనర్ రంగనాథ్ కోర్టుకు వివరించారు. హైడ్రా పనులకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. అయితే చిన్న స్థలాల్లోని నిర్మాణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం ఎక్కడి న్యాయమని, పెద్ద నిర్మాణాలపై చర్యలు తీసుకోరాదా అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా పూర్తిగా చట్టబద్ధంగానే పనిచేస్తోందని ఏజీ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

## ఎర్రకోట సూసైడ్ బాంబర్ ఇల్లు కూల్చివేత

బలగం టీవి, హైదరాబాద్

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనకు సంబంధించి..కారులో ఆత్మాహుతి దాడికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ అలియాస్ ఉమర్ మహమ్మద్ ఇంటిని శుక్రవారం భద్రతాదళాలు కూల్చివేశాయి. కాశ్మీర్‌లోని పుల్వామాలో ఉన్న ఆయన ఇంటిని భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఈ కూల్చివేత ప్రక్రియ కొనసాగింది. పేలుడు పదార్థాలను దాచేందుకు ఉమర్ నబీ ఆ ఇంటిని వాడుకున్నట్టు గుర్తించారు. హుందయ్ ఐ20 కారుతో పేలుడుకు పాల్పడిన ఉమర్ నబీ.. డీఎన్ఏ శాంపిళ్లను కన్ఫర్మ్ చేశారు. అదే విధంగా 50 కెమెరాల ఫుటేజ్‌ను ఉపయోగించి ఎర్రకోట పేలుడు నిందితుడి చివరి గంటలను పోలీసులు(రీకన్‌స్ట్రక్షన్) చేశారు. పేలుడు ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. నిందితులు రూ.26 లక్షలకు పైగా నగదును సేకరించారని, బ్లాస్ ప్రణాళిక అమలుకు ఆ నిధులను నబీకి అప్పగించారని తెలిసింది.

ఢిల్లీ పేలుడు ఘటనలో మతుల సంఖ్య 13కు చేరుకోగా, 20మందికిపైగా గాయపడ్డ విషయం తెలిసిందే. అయితే ఉగ్రకార్యకలాపాలకు మద్దతునిచ్చే వారికి ఇలాంటి శిక్షే ఉంటుందన్న ఉద్దేశాన్ని తెలిపేందుకు భద్రతాదళాలు ఉమర్ నబీ ఇంటిని పేల్చివేశాయి. భారత భూభాగంపై ఉగ్ర కార్యకలాపాలకు చోటు లేదన్న సంకేతాన్ని వినిపించాయి.

# రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ అరాచకాలను, అవినీతిని ఎండబెడుతున్న ప్రతి ఒక్క సోషల్ మీడియా వారియర్‌కు, పార్టీ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సీనియర్ నేత హరీష్ రావు, ఎమ్మెల్సీ రవీందర్ రావు తమ కుటుంబంలో విషాదాలు జరిగినా ఎన్నికల కోసం పనిచేశారు. దీపావళి పండుగను సైతం పక్కనపెట్టి పార్టీ విజయం కోసం ప్రయత్నం చేశారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీఏలో ఫ్యాన్సీ నెంబర్లకు పోటాపోటీ..

**- ఒక్కరోజే రూ.65.38లక్షలకుపైగా ఆదాయం: జేటీసీ సి.రమేష్**




బలగం టీవి, హైదరాబాద్

వాహన ఫ్యాన్సీ నంబర్ల ద్వారా మరోసారి రవాణాశాఖకు కాసుల పంట పండింది. కేవలం ఒక్కరోజులోనే ఆ శాఖ ఖజానాకు భారీ ఆదాయం వచ్చి చేరింది. శుక్రవారం సెంట్రల్ జోన్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల ఈ-వేలంలో వినియోగదారులు పోటీపడ్డారు. ఈ వేలం ద్వారా సుమారు రూ.65,38,889 ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి.రమేష్ తెలిపారు. అత్యంత ఆకర్షణీయమైన టీజీ09హెచ్ 9999 నంబర్ కోసం తీవ్రమైన పోటీ నెలకొనగా, హెూనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్పి సంస్థ దానిని రికార్డు స్థాయిలో రూ. 22,72,222 చెల్లించి దక్కించుకుంది. టీజీ09 జే 0009 నంబర్‌ను దండు ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ తమ ఖరీదైన కారు కోసం రూ.6.80లక్షలు సొంతం చేసుకుంది. టీజీ09 జే 0006 నంబర్‌ను సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ రూ.5.70లక్షలకుపైగా వెచ్చించి కైవసం చేసుకుంది. టీజీ09 జే 0099 నంబర్‌ను గోదావరి ఫార్చ్యూన్ 3.40లక్షలు, టీజీ09 జే 0001 నంబర్‌ను శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రయివేట్ లిమిటెడ్ 2.60లక్షలు, టీజీ09జే0005 నంబర్‌ను నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ 2.40లక్షలు చెల్లించి దక్కించుకుంది. టీజీ09 జే 0018 నంబర్‌ను రోహిత్ రెడ్డి ముత్తు 1.71 లక్షలు, టీజీ09 జే 0007 నంబర్‌ను శ్రీనివాస్ నాయుడు కుందవరపు 1.69లక్షలు, టీజీ09 జే 0123 నంబర్‌ను ఆకుల మాధురి రూ.1.19లక్షలు వెచ్చించి కైవసం చేసుకున్నారు. టీజీ09 జే 0077 నంబర్‌ను మీనాక్షి పవర్ ప్రయివేట్ లిమిటెడ్ 1.41లక్షలు, టీజీ09 జే 0003 నంబర్‌ను జీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ 1.15లక్షలు చెల్లించి దక్కించుకున్నాయి. ఫలితంగా ఒక్కరోజులో రవాణాశాఖ ఖాజానాకు రూ.65.38లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని జేటీసీ సి.రమేష్ తెలిపారు.

# ఎఫ్ఎస్ఎల్‌లో 60 ఉద్యోగాలు

**టీజీఎస్ఎల్పీఆర్బీ నోటిఫికేషన్ జారీ**

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్)లో 60 ఉద్యోగాలకు రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీజీఎస్ఎల్పీఆర్బీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు టీజీఎస్ఎల్పీఆర్బీ చైర్మెన్ వి.వి శ్రీనివాస్‌రావు ప్రకటన జారీ చేశారు. సైంటిఫిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్స్, ల్యాబొరేటరీ అసిస్టెంట్స్, ల్యాబొరేటరీ అటెండర్ పోస్టుల భర్తీకి గానూ ఈ నోటిపికేషన్‌ను జారీ చేశారు. ఈ నాలుగు పోస్టులు కలిపి 60 వరకు ఉద్యోగాలు ఉన్నాయని శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. తమ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీఎస్ఎల్పీఆర్బీ.ఇన్‌లో తెలిపిన తేదీలలో అప్లై చేసుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించిన సిలబస్ వివరాలను కూడా తమ వెబ్‌సైట్‌లో ఉంటాయని వివరించారు. కాగా ఈ ఉద్యోగాలకు రూ.24వేల-రూ.1లక్ష వరకు వేతనాలు ఉంటాయని ఆయన చెప్పారు.